ఎన్నికల పండుగ.. ఉపాధి దండిగా

ఎన్నికల పండుగొచ్చింది. ఏ గ్రామంలో చూసినా దప్పు చప్పుళ్లు, డీజేలతో ర్యాలీలు, నాయకులు, కార్యకర్తల ఆటపాటలతో సందడి కనిపిస్తోంది. ప్రధాన పార్టీల ప్రచారం హోరెత్తుతోంది. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు కావడంతో రాజకీయ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ప్రచారంలో తగ్గేదే లేదంటున్నారు. ఎంత ఖర్చయినా భరించేందుకు ముందుకొస్తున్నారు. పార్టీలు, అభ్యర్థులతో సంబంధం లేకుండా కేవలం జీవనం కోసం పనులు చేసే వారికి ఎన్నికల ఉపాధి దండిగానే లభిస్తోంది. ఉపాధి పొందుతున్న వివిధ వర్గాలపై ప్రత్యేక కథనం. –కరీంనగర్‌రూరల్

- ప్రచారంతో పలురంగాలకు ప్రయోజనం
- నెలరోజులపాటు జీవనోపాధి

ప్రచారంలో మహిళలు



గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేసేందుకు వచ్చినప్పుడు మహిళలు అవసరం పడుతారు. మహిళలు మెడలో పార్టీ కండువాలు వేసుకుని అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొంటారు. బతుకమ్మలు, బోనాలు ఎత్తుకుని ముందు వరుసలో ఉంటారు. నాలుగైదు గంటల పాటు ప్రచారంలో పాల్గొంటే రూ. 200 నుంచి రూ.300వరకు చెల్లిస్తారు. అన్ని పార్టీల ప్రచారాల్లో మహిళలు పాల్గొంటున్నారు. పట్టణాల్లో కొంత ఎక్కువ డబ్బు తీసుకుంటుండగా గ్రామాల్లో తక్కువగా తీసుకుంటారు.

ఫంక్షన్‌హాల్స్, టెంట్‌హౌస్‌లకు గిరాకీ



ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు ప్రతిరోజూ టిఫిన్లు, భోజనాలు పెట్టాల్సి ఉంటుంది. వంట చేసేందుకు వంటసామగ్రిని తీసుకెళ్తుంటారు. వంట మనుషులకు రోజు ఉపాధి లభిస్తోంది. ప్రచార సభలకు అవసరమైన స్టేజీ, టెంట్లు, కుర్చీలను టెంట్‌హౌస్‌ల నుంచి కిరాయి తీసుకుంటారు. కార్యకర్తలు, స్వశక్తి, కులసంఘాల సభ్యులతో సమావేశాలను నిర్వహించేందుకు ఫంక్షన్‌హాళ్లను వినియోగిస్తున్నారు. పెళ్లిళ్లు, ఎన్నికల ప్రచార సమావేశాలుండటంతో ఫంక్షన్‌హాళ్లకు డిమాండ్ పెరిగింది.



కళాబృందాలతో ఆటాపాటా

ప్రచారంలో కళాబృందాల ఆటసాగి జోష్ నింపుతోంది. పార్టీ, అభ్యర్థులపై పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ ఉత్సాహపరుస్తారు. ప్రధాన పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో కళాకారుల ఆటపాటలు ఉర్రూతలూగిస్తాయి. ఒక్కో బృందం లో 8నుంచి 10 మంది సభ్యులుంటారు.



ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించి కళాబృందాలకు చెలిస్తున్నారు.

పూలకు డిమాండ్

ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన అభ్యర్థులకు స్థానిక నాయకులు పూలదండలు వేసి స్వాగతం పలుకుతారు. మహిళలు దారి పొడవునా పూలు చల్లుతుంటారు. ప్రస్తుతం బంతిపూలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఒక్కో గ్రామంలో పూలకు రూ.5వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా గోపాల్‌పూర్, గుంటూరుపల్లి, తీగలగుట్టపల్లి, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లో బంతిపూలను రైతులు సాగు చేశారు. కిలోకు రూ.50నుంచి రూ.100 విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఫ్లెక్సీలు, కరపత్రాల ముద్రణ



కరపత్రాలు ముద్రించడం, ఫ్లెక్సీల తయారుతో ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులకు పని లభిస్తోంది. ఒక్కో అభ్యర్థి వేలసంఖ్యలో కరపత్రాలు, డోర్‌పోస్టర్లు ముద్రిస్తారు. ఒక్కో కరపత్రం రూ.3 నుంచి రూ.5 ఖర్చవుతోంది. ప్రధాన చౌరస్తాల్లో ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

కళాకారులది ప్రధాన పాత్ర



ఎన్నికల ప్రచారంలో డప్పు, ఒగ్గుడోలు కళాకారులు ప్రధానపాత్ర పోషిస్తారు. కోలాట మాడే మహిళా గ్రూపులకు ఉపాధి లభిస్తోంది. స్థానికంగా డప్పు వాయించే వారితో పాటు ప్రత్యేకంగా ఒగ్గుడోలు కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. డప్పు వాయించిన వారికి రూ.500, ఒగ్గుడోలు కళాబృందానికి రూ. 5వేల వరకు చెల్లిస్తున్నారు.

వీడియో గ్రాఫర్లకు చేతినిండా పని



వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లకు చేతినిండా పని లభిస్తోంది. అభ్యర్థులు ప్రచారం చేసే ఫొటోలు, వీడియోలు తీసేందుకు వీడియో, ఫొటో గ్రాఫర్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రచారం పూర్తయ్యేవరకు ఒక్కో ఫొటోగ్రాఫర్ రూ.25వేల నుంచి రూ.30వేలు, వీడియోగ్రాఫర్ రూ.50వేల వరకు తీసుకుంటున్నారు.

ప్రచార వాహనాలకు..



ప్రతీ గ్రామంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచార రథాలు తిరుగుతుంటాయి. ఒక్కో అభ్యర్థి 5నుంచి 10 వరకు ప్రచార వాహనాలు ఉపయోగిస్తున్నారు. ప్రచార వాహనానికి నాలుగువైపుల ఫ్లెక్సీలు, డీజే ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.2వేల నుంచి రూ. 4వేలు ఖర్చు చేస్తున్నారు.

కలిసినట్లేనా..!



డీసీసీ కార్యాలయం ఎదుట నరేందర్‌రెడ్డి మద్దతుదారుల ఆందోళన

- 'పురుమల్ల'కు టికెట్‌పై పార్టీ నాయకుల కినుక
- డీసీసీ కార్యాలయం ఎదుట శ్రేణుల నిరసన
- బుజ్జగించిన కాంగ్రెస్ అభ్యర్థి
- కలిసి పనిచేద్దామంటూ నేతలకు అభ్యర్థన



పార్టీ శ్రేణులను బుజ్జగిస్తున్న పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పురుమల్ల శ్రీనివాస్ ప్రకటనపై ఆ పార్టీ ఆశావహులు కినుక వహించారు. కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి అనుగుణంగా పురుమల్ల అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈక్రమంలో పార్టీ టికెట్‌ను ఆశించిన నాయకులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తుండగా, వారి మద్దతుదారులు ఒకడుగు ముందుకు వేసి డీసీసీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కాగా పార్టీ టికెట్ ప్రకటన అనంతరం రంగంలోకి దిగిన పురుమల్ల శ్రీనివాస్ ఫోన్ ద్వారా, స్వయంగా కాంగ్రెస్ అసంతృప్త నాయకులను కలుస్తున్నారు. కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని అభ్యర్థిస్తున్నారు.

పార్టీ టికెట్‌కు మేం పనికిరామా..!

'టికెట్‌కు మేం పనికిరామా.. మేం అసమర్థులమా.. పార్టీ ఎలా ఆలోచించింది.. సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడుతుంటే.. టికెట్ విషయంలో మమ్మల్ని ఎందుకు ప్రక్కనపెట్టిందో పార్టీ చెప్పాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నరేందర్‌రెడ్డికి పార్టీ అన్యాయం చేసిందంటూ ఆయన మద్దతుదారులు మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. పార్టీ శ్రేణుల ఆందోళనతో అక్కడికి చేరుకున్న కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనకు అన్యాయం జరిగిందని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరగనీయనన్నారు. పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలందరికి సముచిత స్థానం లభించేలా కృషి చేస్తానన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ, అఖిల్, పొరండ్ల రమేశ్, జీడీ రమేశ్, షబానాబేగం, ధన్నుసింగ్, కీర్తి కుమార్, ఖమ్రొద్దీన్, ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌రావు మద్దతుదారుల భేటీ

కాగా టికెట్ ఆశించిన మరో నాయకుడు మెన్నేని రోహిత్‌రావు మద్దతుదారులు ముకరాంపురలోని ఆయన నివాసం వద్ద ప్రత్యేకంగా భేటీ అయ్యారు. టికెట్ విషయంలో రోహిత్‌రావుకు పార్టీ అన్యాయం చేసిందంటూ ఆవేదన చెందారు.

కలిసినడుద్దాం..

'మనమంతా ఒక్కటే.. గతంలో నేనూ కాంగ్రెస్‌లోనే ఉండేవాడిని.. బీఆర్‌ఎస్‌లో నామీద జరిగిన కుట్రలు భరించలేక మళ్లీ సొంత గూటికి చేరుకున్నా.. కాంగ్రెస్ పార్టీ నాకు టికెట్ ఇచ్చింది...మనమంతా కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం.' అంటూ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ పార్టీ శ్రేణులను అభ్యర్థించారు. పార్టీ శ్రేణుల నిరసన సమాచారంతో డీసీసీ కార్యాలయానికి చేరుకున్న ఆయన వారితో మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తుందని, అందరికీ న్యాయం జరుగుతుందని, తాను కూడా వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని శ్రీనివాస్ ఆలింగనం చేసుకొని అంతా కలిసిపనిచేద్దామని చెప్పడంతో పార్టీ శ్రేణులు ఆందోళన విరమించారు.

ఇదిలాఉంటే అంతకు ముందు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యాలయంలో కలుసుకున్నారు. అలాగే మెన్నేని రోహిత్‌రావుకు ఫోన్ చేసి కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపించుకొందామని శ్రీనివాస్ అభ్యర్థించారు.

తొందరపడొద్దు.. భవిష్యత్ ఉంటది



కోమటిరెడ్డికి నచ్చచెబుతున్న వంశీచంద్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా మంచి భవిష్యత్ ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, ప్రత్యేక దూత వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి భరోసా ఇచ్చారు. పార్టీ టికెట్ రాకపోవడంతో అసంతృప్తితో ఉన్న నరేందర్‌రెడ్డికి బుజ్జగించేందుకు వంశీచంద్ మంగళవారం రాత్రి కరీంనగర్‌కు చేరుకొని సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనతో చర్చలు జరిపారు. పార్టీ కోసం సంవత్సరాలుగా కష్టపడ్డా తనకు టికెట్ నిరాకరించడంపై నరేందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ సమీకరణల కారణంగా టికెట్ శ్రీనివాస్‌కు కేటాయించడం జరిగిందని, రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని వంశీచంద్ నచ్చచెప్పారు. ఏఐసీసీ పెద్దల ఆదేశంతోనే తాను వచ్చానని, తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని నరేందర్‌కు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిమ్మాపూర్: టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని నేదునూర్ ప్రభుత్వ పాఠశాలలో 'వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి అనుసరించే ఐదు అంశాలు' అనే దానిపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 6, 7వ తరగతి, సీనియర్ విభాగంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగంలో ముగ్గురు చొప్పున బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా ప్రకటించారు. జూనియర్ కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కావ్య లావణ్య, జి.రామ్‌చరణ్, చాణక్య ఈశ్వర్, సీనియర్ కేటగిరీలో స్వర్ణదేశ్, భూమిక, స్ఫూర్తి పతకాలు సాధించారు. కార్యక్రమంలో టీసీఎస్ రీజినల్ మేనేజర్ లీలాకృష్ణరాజ్ కిరణ్, రజనీకాంత్, మనోజ్, హెచ్‌ఎం చీటి లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు, తిరుపతిరెడ్డి, జాకీర్‌హుస్సేన్, గనీ, పద్మ, అనీస్ ఫాతిమా, అమల, శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా


మదర్సాల సందర్శన



మదర్సాలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు

కరీంనగర్: నగరంలోని ఖాన్‌పురా, సవరన్ స్ట్రీట్, అంబేడ్కర్‌నగర్, కార్ఖానగడ్డ, గోదాంగడ్డ, కశ్మీర్‌గడ్డ, ఎల్‌ఎండీ కాలనీ, రామకృష్ణ కాలనీలలోని మదర్సాలను మంగళవారం డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ సందర్శించారు. అందులో చదువుకునే పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే విద్యపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మదర్సాల యజమానులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టీం నరేంద్ర, సాయికిరణ్, మహేశ్, ప్రియాంక, మర్సాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'మోడల్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

కొత్తపల్లి: మహబూబ్‌నగర్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల అండర్–19 విభాగంలో కొత్తపల్లి మండలం ఎలగందులలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.మమూరి, బాస్కెట్‌బాల్ పోటీలకు పి.కీర్తన, కె.శివకుమార్‌లు ఎంపిక కావడాన్ని హర్షిస్తూ మంగళవారం వారిని అభినందించారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీ ఎర్రం హరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

'బీసీలకు బీఆర్‌ఎస్, బీజేపీ ద్రోహం'

కరీంనగర్ కార్పొరేషన్: బీసీలకు బీఆర్‌ఎస్, బీజేపీలు ద్రోహం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర నాగరాజు ఆరోపించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌ను 34 నుంచి 23 శాతానికి తగ్గించిందని విమర్శించారు. బీసీ కుల గణనను బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ రెండు పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు.

కృత్రిమ కాలు ఏర్పాటు

చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మికురాలు సామల లక్ష్మీ ప్రమాదవశాత్తు కాలును కోల్పోయారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైపూర్ కృత్రిమ కాలును అమర్చారు. ఐఏఎస్ పరికిపండ్ల నరహరి చొరవతో హైదరాబాద్‌లోని మహవీర్ ట్రస్టు సౌజన్యంతో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ కాలును సమకూర్చారు.

అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్



ఎంపికైన వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కాకినాడలోని జేఎన్‌టీయూలో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు జరిగే అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు శ్రీకాంత్, అరవింద్, మణింద్ర, కార్తీక్‌లు ఎంపికైనట్లు కళాశాల పీడీ నాగేశ్వర్‌రావు తెలిపారు. అదేవిధంగా శాతవాహన విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో కళాశాల జట్టు ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచిందన్నారు. ఎంపికై న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు..

కాకినాడ జెఎన్‌టీయూలో జరిగే అంతర్ విశ్వ విద్యాలయ కబడ్డీ పోటీలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు సిద్ధూ, లారెన్ కుమార్‌లు ఎంపికైనట్లు కళాశాల పీడీ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆగం రావు, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, సంపత్ కుమార్, రామేశ్వర్‌రావులతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూపం మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్‌లో జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదిగల విశ్వరూపం మహాసభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారని, పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, తుంగ ఆంజనేయులు, దండు అంజయ్య, చిలుముల రాజయ్య, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, గంగాధర పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



జేసీబీతో ప్రహరీ కూల్చి వేస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: సందట్లో సడేమియాలా భూకబ్జాదారులు ఎన్నికల హడావుడిలో అధికారులుండటంతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ప్రభుత్వస్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వేనం.28లోని చెరువుశిఖం స్థలంలో ఇద్దరు వ్యక్తులు రెండురోజుల నుంచి అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారు. మంగళవారం స్థానికులు అక్రమ నిర్మాణంపై ఆర్డీవో మహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ నవీన్ వెంటనే ఆర్ఐ వాస్తవిక్‌ను మోఖాపై పంపించారు. పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లాతో కలిసి ఆర్ఐ అక్రమంగా నిర్మించిన రెండు ప్రహరీలను జేసీబీతో కూల్చివేయించారు. ప్రభుత్వ,శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టప్రకారం తగిన చర్యలు చేపడుతామని తహసీల్దార్ నవీన్ తెలిపారు.

14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించొద్దు



అవగాహన కల్పిస్తున్న రమేశ్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించొద్దని, లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే 18 ఏళ్ల లోపువారితో ప్రమాదకర పనులు చేయించవద్దన్నారు. కార్యక్రమంలో నవక్రాంతి సమన్వయకర్త రమేశ్, జితేందర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, టీచర్లు రాజమౌళి, ప్రతిమ, శంకరమ్మ, శంకర్, జ్యోత్స్న, శామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ప్రశ్నించిన నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా కొంతమందికే దళితబంధు, బీసీబంధు అందించారని మిగతా వారికి ఎలాంటి అభివృద్ధి పథకాలు అందలేదని యువత, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గ్రామంలో ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. ప్రచారం అడ్డుకోవద్దని బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. అసహనానికి లోనైనా ఎమ్మెల్యే తాగుబోతుల మాటలు పట్టించుకోవద్దని, ఇలాంటి వారు ఊరికి ఇద్దరు, ముగ్గురు ఉంటారని ప్రచారం కొనసాగించారు. ఎన్నికల అధికారులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని నియంత్రించి అడ్డుకున్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు కాంగ్రెస్ నాయకులకు నోటీసులు అందించారు. అదేవిధంగా సమస్యలపై ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే దుర్భాషలాడారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'సెయింట్‌జార్జ్' ప్రాజెక్టు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ పాతిమారెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'ఐస్ రిజర్వాయర్' నమూనా రాష్ట్రస్థాయి నేషనల్ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికై నట్లు ఆ స్కూల్ చైర్మన్ డా.పోలిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 93 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో సెయింట్ జార్జ్ విద్యార్థులు హసన్, రామ్‌చరణ్ రూపొందించిన ఐస్ రిజర్వాయర్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ మల్లికార్జున్, సీఈవో ఉమాకాంత్‌ను మంగళవారం ఆయన అభినందించారు.

సౌత్ జోన్ టోర్నమెంట్‌కు వీఎస్‌ఆర్ విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జి.రాహుల్, టి.నిఖిల్, జి.వేణు సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమకుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సిద్ధమల్ల విజయ్ మంగళవారం తెలిపారు. 9న ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరగబోయే సౌత్ జోన్ యూనివర్సిటీ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనడానికి శాతవాహన యూనివర్సిటీ తరపున ఎంపికయ్యారని, విద్యార్థుల ఎంపిక పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

గంగాధర: మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి చొప్పదండి యువజన కాంగ్రెస్ కన్వీనర్ వొడ్నాల యగ్నేశ్ మంగళవారం లక్ష రూపాయలు విరాళంగా ఆలయ చైర్మన్ వైద భూపతికి అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా అండగా నిలిచిన యగ్నేశ్‌కు భూపతి కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం



జమ్మికుంట: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన చర్మకారుడు మడిపల్లి కొంరయ్య ఇటీవల మృతి చెందాడు. టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ మంగళవారం మృతుడి కుటుంబానికి యాభై కిలోల బియ్యం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..పేద కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, అనిల్, రమేశ్, ప్రతాప్, ప్రశాంత్, సుదర్శన్, అశోక్, నవీన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.